మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# చనిపోయిన వారికి బిల్లులు !

**ఉపాధి హామీలో భారీ అక్రమాలు**
**బినామీ పేర్లతో నిధులు స్వాహా**


సామాజిక తనిఖీలో సభ్యులు

**ఊట్కూర్, నవంబరు 6 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండలంలోని మొగ్దంపూర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎన్ఆర్ఈజిఎస్) భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పనిచేయని వ్యక్తుల పేర్లతో బినామీ ఖాతాల ద్వారా నిధులు విత్‌డ్రా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం తేల్చింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి సామాజిక ఉద్యమకారుడు కొనింటి నర్సింహులు సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం కోరగా, అందిన సమాచారం పరిశీలనలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. క్షేత్ర సహాయకుడు మూడు సార్లు సస్పెండ్ అయ్యి తిరిగి విధుల్లో చేరినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన పర్యవేక్షణలోనే చనిపోయిన వారి పేర్లతో, పనిచేయని వ్యక్తుల పేర్లతో బినామీ పద్ధతిలో డబ్బులు డ్రా అయినట్లు తేలింది. 14వ విడత సామాజిక తనిఖీ బృందం ప్రస్తుతం ఊట్కూర్ మండలంలో తనిఖీలు జరుపుతోంది. మొగ్దంపూర్‌లో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించిన బృందం ఆశ్చర్యపోయే విషయాలను గుర్తించింది. అక్రమ చెల్లింపులు వాస్తవమని నిర్ధారించింది. జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను
# వేగవంతం చేయాలి
### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట,నవంబరు 6 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి హౌసింగ్ అధికారులు ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. జిల్లాకుమంజూరైన ఇండ్లలో ఎన్నిగ్రౌండింగ్ అయ్యాయి ఎన్ని పూర్తిదశకు చేరుకున్నాయో హౌసింగ్ పీడీశంకర్‌నాయక్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లక్ష్య సాధనలో వెనకబడిన నర్వ, మరికల్, మక్తల్ మండలాల ఎంపీడీవోలపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు లేదా ఇసుక కొరత వంటి కారణాలు చెప్పడం సరికాదని వారం రోజుల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. 45 రోజుల్లో పనులు ప్రారంభించని ఇండ్లను రద్దు చేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇందిరా డైరీ, షీప్ ఫార్మింగ్ స్కీమ్ కింద జిల్లాలో 631 అప్లికేషన్లు వచ్చినట్లు మైనార్టీ శాఖ అధికారి ఎం.ఏ.రషీద్ వివరించారు. వాటిని త్వరితగతిన వెరిఫై చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవోలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆస్తి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని బాల్య వివాహాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పంచాయతీ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ నంబర్ రెండు రోజుల్లో రాయాలని ఆమె ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## 396 పాఠశాలలకు
## 16 పాఠశాలకే ఇంటర్నెట్ కనెక్టివిటీ

- మిగతా చోట్ల ఎందుకు ఇవ్వలేదు..
- ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించండి
- యూడైస్ వివరాలు పక్కాగా నమోదు చేయాలి
- గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాలటౌన్,నవంబర్ 6, ప్రభాతవార్త:** పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన యుడైస్ వివరాలు ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యు డైస్‌లో అప్డేట్ చేసిన వివరాలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు సరిపోలేలా ఉన్నాయో లేదో చూసుకునే బాధ్యత ఆయా మండలాల విద్యాధికారులపై ఉందన్నారు. విద్యాశాఖకు సంబంధించి వివిధ యాప్ ల నిర్వహణ, ఇతర విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలల వివరాలు, ఎక్కడెక్కడ సివిల్ పనులు జరుగుతున్నాయి, పూర్తిస్థాయిలో మౌలిక వసతులు అవసరం ఉన్న పాఠశాలల వివరాలు వారంలోగా పక్కాగా సేకరించాలని ఆదేశించారు. పాఠశాలలకు మంజూరయ్యే నిధులు వేటికి ఖర్చు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈడబ్ల్యూ ఐడిసి (ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్) ఇంజనీర్లు కూడా ఎప్పటికప్పుడు తరగతి గదులు నిర్మాణం, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు చేస్తున్న పనులను పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో మొత్తం 396 పాఠశాలలకుగాను ఇంటర్నెట్ కనెక్టివిటీ కేవలం 16 పాఠశాలలోనే ఉందని, మిగతా చోట్ల ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి వినియోగించుకోవాలని సూచించారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వీడియోలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజు, జిల్లా ఇన్చార్జి విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఈడబ్ల్యూఐడిసి డిఈ వెంకట్ రెడ్డి, ఏఈలు మోహన్ రెడ్డి, ఆజాం, సెక్టోరియల్ అధికారులు హంపయ్య, శాంతిరాజు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.



## జార్ఖండ్ టు జడ్చర్ల..!

- గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ వైనం
- ఉదండాపూర్ ప్రాజెక్టులో విధులు
- వివరాలు వెల్లడించిన ఈపీఈవో సుధాకర్ గౌడ్

3

- యుఐడిఎఫ్ నిధుల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా కేటాయింపులు
- పదుల సంఖ్యలో సెక్రటేరియట్ చుట్టూ ప్రదక్షిణ
- ప్రతి ఫైలు కదలేవరకు పర్యవేక్షణ..
- సాధారణ ఉద్యోగిలా క్యాంటీన్‌లో భోజనం
- నిధుల సమీకరణలో యెన్నం సక్సెస్

# పాలమూరుకే అగ్ర తాంబూలం



### ఫలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి

| రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీల వారీగా విడుదలైన నిధులు వివరాలు రూ.కోట్లలో.. | |
|---|---|
| ప్రాజెక్టు / మున్సిపాలిటి | నిధులు |
| ఖాగజ్‌నాగర్ | రూ.31.50 |
| భైంసా | రూ.25.62 |
| వరంగల్ | రూ.551 |
| ఖమ్మం | రూ.200 |
| మహబూబ్‌నగర్ | రూ.603 |
| సిద్ధిపేట | రూ.141.34 |
| కరీంనగర్ | రూ.180 |



**మహబూబ్నగర్ బ్యూరో, నవంబర్ 6, ప్రభాతవార్త:** నిబద్ధత దూరదృష్టి ఉండి, తనను గెలిపించిన ప్రజల కోసం ఏదైనా చేయాలనే తపన ఉన్న నేత..ఏదైనా పని అనుకుంటే అది పూర్తయ్యే దాక మధ్యలో వదిలేయకుండా నిత్యం పర్యవేక్షించే వ్యక్తిత్వం ఆయనది..ప్రభుత్వ వ్యవస్థలో ఏదైనా ఒక పనికి, కపటక మమలుకు, ఒక ఫైల్ డిపిఆర్ రూపొందడానికి, నిధుల విడుదలకు చాలా పెద్ద ప్రాసెస్ ఉంటుంది.. ప్రతిపాదనలు పంపడం ఒక ఎత్తు అయితే పనులు అమలులోకి రావడం మరొక ఎత్తు. దాని వెనక చాలా రోజుల శ్రమ నెలల తరబడి ఫాలోఅప్ చేయాల్సిన అవసరం ఉంటుంది. అయితే ప్రతిపాదనలు పంపడం నుంచి నిధులు విడుదల వరకు వివిధ దశల్లో ఫాలో అప్ చేయాల్సి ఉంటుంది. ఇలా వివిధ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపడమే కాదు నిధుల విడుదల వరకు తానే దగ్గరుండి నిత్యం పర్యవేక్షిస్తూ సెక్రటేరియట్లో ఫాలోఅప్ చేస్తూ తనదైన మార్క్ చూపిస్తూ రాష్ట్రంలోనే అత్యధిక నిధులు తేవడంలో సక్సెస్ అయ్యారు మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ఎందుకు నిదర్శనమే ఇటీవల విడుదలైన యుఐడిఎఫ్ నిధుల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా పాలమూరుకు కేటాయించడం.

**రాష్ట్రంలోనే అత్యధికంగా..**

గత నెల 25న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(యూఐడీఎఫ్) రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీలకు సంబంధించి నిధులను విడుదల చేశారు. ఇందులో భాగంగా ఎనిమిది వాటర్ సప్లై ప్రాజెక్టులకు సంబంధించి, తొమ్మిది అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు సంబంధించి పనులకు సంబంధించిన నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఇందలో పాలమూరుకే అగ్ర స్థానంలో కేటాయింపులు చేయడం విశేషం. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి ఇప్పటివరకు అంత పెద్ద మొత్తంలో నిధులు రావడంతో అందరూ ఎమ్మెల్యేకు ప్రశంసల వరద కురిపిస్తున్నారు. హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు మహబూబ్‌నగర్‌లో గురువారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

**నిధులు ఉట్టిగ రాలే..**

అభివృద్ధి కోసం కేవలం మాటలు సరిపోవు. కృషి, ప్రణాళిక, దృఢ సంకల్పం అవసరం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించాలంటే క్షేత్రస్థాయిలో నిరంతర శ్రమ అవసరం. మహబూబ్ నగర్ గత 70 ఏళ్లుగా అభివృద్ధి పరంగా వెనుకబడిన ప్రాంతంగా నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ, రాష్ట్ర విభజన తర్వాత కూడా ప్రజలకు ఆశించినత అభివృద్ధి అందలేని పరిస్థితి నెలకొంది. విద్య, మౌలిక సౌకర్యాల రంగంలో ఎన్నో ఏళ్ల అవకాశాలు కోల్పోయింది. అయితే, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జిల్లా అభివృద్ధి దిశగా కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రజల్లో కొత్త ఆశలు, నమ్మకం, విశ్వాసం ఏర్పడ్డాయి.

**ఇదీ నిధుల లెక్క..**

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ముఖ్య అభివృద్ధి కార్యక్రమాలు తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి శాశ్వత పరిష్కారంగా 824 కోట్లు నిధుల సాధధించారు. నిలిచిపోయిన అమృత్ పథకం ఫైలును ముందుకు తీసుకొని రూ.269 కోట్లు మున్సిపాలిటీకి మంజూరు చేయించారు. పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి..మొదట రూ.18 కోట్లు, అనంతరం యూజీసీ నుంచి ..100 కోట్లు గ్రాంట్ సాధించడంతో యెన్నం కృషి ఎనలేదని చెప్పవచ్చు. ఇటు ఎంపీ డీకే అరుణమ్మతో సఖ్యతగా ఉంటూ కేంద్రం నుంచి రవాల్సిన నిధులను తీసుకోవడంతో తనదైన శైలిలో ముందుకుసాగుతున్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఇంజినీరింగ్ లా కళాశాలల స్థాపన, స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాల విస్తరణ, బాసర ఐఐఐటి కళాశాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో డబుల్ డెస్క్ బెంచీలు, డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్ అందజేయడం ఇలా ఒక్కటేమిటి చెప్పుకుంటూ పోతే పాలమూరుకు యెన్నం నిధులు వరద పారించారు. మున్సిపాలిటీని నగరపాలక సంస్థగా అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఎక్కడా కూడా ఇబ్బందులు లేకుండా చేశారు. పర్యవేక్షణలో నిబద్ధత నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతి ఫైల్ విషయంలో ఎమ్మెల్యే వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ, క్లర్క్ నుండి ఉన్నతాధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రిని వరుసగా కలిసి ఫైళ్లను ముందుకు తీసుకువెళ్తున్నారు. ఫోన్ కాల్స్ పై ఆధారపడకుండా ప్రతి కార్యాలయం, ప్రతి టేబుల్ వద్దకు స్వయంగా వెళ్లి ప్రాజెక్టుల అవసరాలను వివరించి నిధులను, అనుమతులను సాధించడం ఆయన ప్రత్యేకత, వ్యక్తిగత విమర్శలు, చిల్లర రాజకీయాలకు దూరంగా, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా ఆయన కృషి చేస్తున్నారు. మహబూబ్ నగర్ అభివృద్ధి వేగంగా సాగడం, ఆయన దూరదృష్టి, నిబద్ధత, ప్రజా సేవకు నిదర్శనంగా చెప్పవచ్చు.



# క్రీడల్లో గెలుపోటములు సహజం

- రెండింటిని సమానంగా తీసుకోవాలి
- క్రీడలను నిత్యం కొనసాగించాలి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి


క్రీడలను ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 6 ప్రభాతవార్త :** క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని సమానంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం గోపాలపేట మండలంలోని బుద్దారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 11వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహిస్తుండగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన, జాతీయ పతాక ఆవిష్కరణ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి ప్రసంగిస్తూ వనపర్తి కేవలం వనాలపర్తి మాత్రమే కాదని ఇది ఆటలపర్తి కూడా అని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని విద్యార్థులు సమానంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మీరు కూడా ఆత్మవిశ్వాసంతో చదువుతో పాటు క్రీడల్లో కూడా అత్యున్నతంగా రాణించాలని తెలియజేశారు. ఇటీవల భారత మహిళల జట్టు క్రికెట్ ఆటలో ప్రపంచ కప్‌ను కైవసం చేసుకున్న విషయాన్ని విద్యార్థినులకు గుర్తు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో ఓటమిని ఒక పాఠంగా తీసుకుని, మళ్లీ సాధన చేసి విజయాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఓటమి అనేది ముగింపు కాదని విద్యార్థినులకు -మిగతా3లో..




# నిధుల సంబురం

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.824కోట్లు మంజూరుపై హర్షం
- మహబూబ్‌నగర్‌లో భారీ బైక్ ర్యాలీ..
- ఎమ్మెల్యే యెన్నం కృషి అభినందనీయమంటూ ప్రశంసలు

**మహబూబ్‌నగర్ , నవంబర్6,ప్రభాతవార్తః** మహబూబ్ నగర్ నగర అభివృద్ధికి సమగ్ర దృష్టి, భవిష్యత్ ప్రణాళిక, ప్రజల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన నాయకుడు మన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరానికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాగునీటి ప్రాజెక్టులకు రూ.824 కోట్లు మంజూరు చేయించడంలో ముఖ్య పాత్ర పోషించినందుకు, అలాగే నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి, శ్రీనివాస కాలనీ, అక్కడ నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు -మిగతా3లో..

# చివరి గింజ వరకు కొంటాం..

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
### ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాలటౌన్, నవంబర్ 6, ప్రభాతవార్త:** రైతులు పండించిన వరి ధాన్యము చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. గురువారం ధరూర్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ప్రా రంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని ప్రతి రైతు కు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందని తెలిపారు.ఈ ఏడాది జిల్లాలోని అన్ని మండలాలకు గాను మొత్తం 81 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.గతంలో రైతులు తమ ధాన్యాన్ని గిట్టుబాటు ధర రాకపోయినా రైస్ మిల్లర్లకు అమ్మకానికి ఇవ్వాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు ప్రభుత్వం స్వయంగా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం రైతు సంక్షేమానికి దారితీసే చారిత్రాత్మక నిర్ణయ మని పేర్కొన్నారు.ధాన్యంలో తేమశాతం 17కి మించకూడదని తెలిపారు. రైతులు బాగా ఎండబెట్టి,తాళ్లు మట్టి లేకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తీసు కురావాలన్నారు.ధాన్యం తూకంవేసి,వివరాలు ఆన్లైన్‌లో అప్లోడ్ అయిన త ర్వాత రెండు మూడురోజుల్లో రైతులఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయ బడతాయని తెలిపారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల వివరాలు వెల్ల డిస్తూ,ఎ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389,సాధారణ రకానికి రూ.2,369, అలాగే సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇవ్వబడుతుందని చెప్పారు. కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్స్,గన్నీ బ్యాగ్స్,టార్పాలిన్లు వంటి అవసరమైన సదుపాయాలన్నీ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రైతులు తమ పంటలను దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరపాలని సూచించారు. పర్యావరణహిత వ్యవసాయం ప్రాముఖ్య తను ప్రస్తావిస్తూ, నేను కూడా రైతు బిడ్డనే.ఈసారి నా పొలంలో సగం భాగంలో యూరియా ఉపయోగించకుండా పంటలు పండిస్తున్నాని, రెండు మూడు రోజుల్లో ఆ పంట ఎంతగా పండుతుందో పరిశీలిస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు,గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, అడిషనల్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసులు,ఏఓ శ్రీలత,ఐకేపీ సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

## బాధితులకు సత్వర
# న్యాయం జరగాలి
### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
### జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 6 ప్రభాతవార్త:** జిల్లాలోని ఎస్‌సి., ఎస్‌టి అట్రాసిటీ కేసులలో బాధితులకు తత్వరా న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం విసి కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎస్పీ డి.జానకితో కలిసి జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో గత సమావేశం నుండి ఈ సమావేశం వరకు కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో 2019నుండి 2025వరకు ఎస్‌సి,ఎస్టీ అట్రాసిటీ నమోదైన కేసులు, బాధితులకు పరిహారం -మిగతా4లో..



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## అక్రమ ఇసుక తరలింపును అడ్డుకోవాలి

**ఆత్మకూర్ నవంబర్ 6, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని రేచింతల గ్రామ సమీపంలో గల ఒక చెట్టు వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక తరలింపును తక్షణమే అడ్డుకోవాలని రేచింతల గ్రామానికి చెందిన పలువురు యువకులు,స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గురువారం రోజు ఆత్మకూర్ తాసిల్దార్ చాంద్ పాషాకు వినతిపత్రం సమర్పించారు. కడచిన పది రోజులుగా కేవలం ఒక ట్రాక్టర్కు మాత్రమే పర్మిషన్ తీసుకుని రాజకీయ పలుకుబడితో ఇస్తారా ఇసుకను తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని తాసిల్దార్ కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో పలుమార్లు స్థానిక పోలీసులకు సమాచారం అందించినప్పటికీ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని తద్వారా నేరుగా తాసిల్దార్ కు ఫిర్యాదు చేశామని తాసిల్దార్ చర్యలు తీసుకొని పక్షంలో గ్రామస్తులమంతా ఏకమై జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయునట్లుగా వారు తెలిపారు.



తహసీల్దార్ కు ఫిర్యాదు చేస్తున్న యువకులు

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో

## ఆత్మకూర్ కాంగ్రెస్ నాయకులు

**ఆత్మకూర్ నవంబర్ 6, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అటు ప్రతిపక్షం నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మక్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ తదితరులు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటుగా పలువురు కాంగ్రెస్ నాయకులు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ ని గెలిపించేందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని వెంగళరావు నగర్ డివిజన్లో గడ్చిన రెండు రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లుగా వారు ప్రభాతవార్తకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్న తమకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని వారు తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఆత్మకూర్ కాంగ్రెస్ నాయకులు

## పశువులకు తప్పనిసరిగా గాలికుంటు

## టీకాలు వేయించుకోవాలి : డా. స్వరూప రాణి

**వడ్డేపల్లి, నవంబరు 6 ప్రభాతవార్త:** మండలం, గ్రామాల్లో రైతుల పశువులను కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు చేయిస్తోందని మండల పశువైద్యురాలు డా. స్వరూప రాణి తెలిపారు. పశు వైద్య పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జూలేకల్‌లో మొదటి రోజు పశువులకు గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు చేశారు. 30 మంది రైతులకు లబ్ధి కల్గింది. ఆవులు, ఎద్దులు, కోడెలు, దూడలు 26, గేదెలు, దూడలు 556 మొత్తం 582 పశువులకు టీకాలు చేసారు. 16 పశువులకు కొత్త గా గుర్తింపు నెంబర్ లు వేశారు. రైతుల ఆర్థిక పరి స్థితి బాగు పడాలని ఉచితంగా టీకాలు సరఫరా చేస్తోందని తెలిపారు. రైతులు పశు వైద్య సిబ్బందికి సహకరించి, పశువుల టీకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి వీఎల్‌వో వర ప్రసాద్, ఎల్ఎస్ఏ షక్ లతీఫ్, ఆఫీస్ సహాయ సిబ్బంది వెంకటమ్మ, కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

## ఎంజెపిపి విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ఉప్పునుంతల, నవంబరు 6 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డా.స్వప్న మాట్లాడుతూ వర్షాకాలంలో అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అందరూ గోరువెచ్చని నీరు త్రాగాలని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు ఆమె సూచించారు. అనంతరం చేతులు శుభ్రపరచుకునే విధానంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వైద్యాధికారిణి డా. స్వప్న, ఎంపిహెచ్ఇఒ మధు నాయక్, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, జగదీశ్, ఎంఎల్ హెచ్‌పి నవ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య అధికారిణి డా. స్వప్న

## కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**గద్వాల టౌన్ , నవంబర్ 6, ప్రభాతవార్త:** మదాసి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలని మాదాసి కురవ సంఘా ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లికార్జున్ కు వినతి పత్రం అందజేశారు. గురువారం గద్వాల మండలం తహసీల్దార్ కార్యాలయం లో నెంబర్ 1268 మెమోని అమలుపరిచాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోయిల దిన్నే తిక్కయ్య , గణపతి మెడికల్ మహేష్, జమ్మిచేడు తాయన్న, ఆర్ ఎంపీ విజయ్ కుమార్ లు తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మెమో జారీ అయి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్న ప్రభుత్వం మదాసి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చడం లేదని, ఈ విషయం పై ప్రభుత్వం వెంటనే స్పందించి మదాసి కురువలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలను మంజూరు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మదాసి కురువలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలను అమలు చేయకపోవడం వల్ల తీవ్ర నష్టానికి గురవుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసిల్దార్ స్పందిస్తూ సమస్య ను పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.



తహసీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## సమాచార హక్కు చట్టంపై పూర్తి

## అవగాహన కలిగి ఉండాలి: తరుణ్

**వనపర్తి,నవంబరు 6 ప్రభాతవార్త:** గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు గ్రామస్థాయి అధికారులు సమాచార హక్కు చట్టం, గ్రామ సభల నిర్వహణపై పూర్తిఅవగాహన కలిగి ఉండాలని వనపర్తిజిల్లా పంచాయతీ అధికారి తరుణ్ సూచించా రు. గురువారం సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్ డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుండి మాస్టర్ ట్రైనర్ పి.కృష్ణ గ్రామ సభల్లో పాల్గొనే గ్రామస్థాయి లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు ఒకరోజు శిక్షణకార్యక్రమం నిర్వహించగా డిపిఒ తరుణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు ప్రతినెల గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించడమే కాకుండా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు.ఇందులో భాగంగ సమాచార హక్కుచట్టం, గ్రామ సభల నిర్వహణపై గ్రామ స్థాయి అధికారులకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు.లైన్ డిపార్ట్మెంట్‌లు అయిన పంచాయతీరాజ్, సంక్షేమశాఖ, నీటిపారుద ల, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిశాఖ,విద్యా,వైద్య శాఖల నుండి 35 మంది గ్రామస్థాయి సిబ్బంది ఈ రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.పదవి విరమణ పొందిన మాజీ జిల్లా పంచాయతీ అధికారి, ప్రస్తుత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మాస్టర్ ట్రైనర్ కృష్ణ సిబ్బందికి గ్రామ సభల నిర్వహణ, సమాచార హక్కు చట్టం 2005 పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో లైన్ డిపార్టుమెంట్ సిబ్బందితో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సహాయ కార్యనిర్వాహణ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

### వెలుగొండలో పోలీసుల

### విస్తృత తనిఖీలు, 54 వాహనాల సీజ్

**బిజినేపల్లి, నవంబరు 6 ప్రభాతవార్త:** నేరాల నియంత్రణకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ తెలిపారు. వెలుగొండ గ్రామంలో గురువారం తెల్లవారుజామున పోలీస్ శాఖ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమ పై వేధింపులను మహిళలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. యువత చదువుపై శ్రద్ధ వహించాలని, వాహనాలు నడిపే వారు అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకో వాలని సూచించారు.ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. అలాగే నెంబర్ ప్లేట్లు లేని సరైన పత్రాలు లేని 47 ద్విచక్రవాహనాలు, 03 ఆటోలను,04 కార్లను పోలీసులు సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం ప్రజలను అప్రమత్తం చేయడమే అన్నారు. సీఐ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రయాణించే సమయంలో వాహనాల అన్ని సర్టిఫికెట్లను వెంట ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలు జరగకుండా స్థానికులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచనలు చేశారు. కార్డెన్ సెర్చ్‌లో ఎస్సైలు శ్రీనివాస్, హరిప్రసాద్, గురుస్వామి, నరేష్, గోవర్ధన్ 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పి శ్రీనివాస్



వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**గద్వాల టౌన్ నవంబర్ 6, ప్రభాతవార్త:** పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశించారు .గురువారం గద్వాల శివారులోని కొండపల్లి రహదారిలో ఉన్న బాలాజీ జన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు తెచ్చిన పత్తి నాణ్యతను,తూకం ప్రక్రియను పరిశీలించి,పత్తి జిన్నింగ్ ప్రక్రియను ప్రారంభం నుండి చివరి దశ వరకు పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలు కేంద్రాలకు పత్తిని ఆరబెట్టి తీసుకొని వస్తే గిట్టుబాటు ధర లభిస్తుంది అన్నారు.రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.మీ పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఒక్క ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు సీసీఐ అధికారులు కొనుగోలు కొనసాగిస్తారని తెలిపారు.స్లాట్ బుకింగ్,రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.పత్తి పంట వేసేటప్పుడే రైతులు తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో,దాని ప్రకారమే స్లాట్ బుకింగ్ చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం త్వరలో మరో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిల్లులో ప్రతిరోజు 1350 క్వింటాళ్ల సామర్థ్యంతో పత్తి కొనుగోలు జరుగుతోందని,దీనిని 2000 క్వింటాళ్లకు పెంచాలని మిల్లు యాజమాన్యం కోరగా, కలెక్టర్ 1800 క్వింటాళ్ల వరకు పెంచే అవకాశం పరిశీలించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ,సిసిఐ ఇన్చార్జి రాహుల్ కలేనా,గద్వాల మార్కెట్ యార్డ్ కార్యదర్శి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



జిన్నింగ్ మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# పత్తి కొనుగోలు కేంద్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి

### అఖిల భారత ఐక్య రైతు సంఘం వనపర్తి జిల్లా కమిటీ

**వనపర్తి, నవంబరు 6 ప్రభాతవార్త :** అఖిలభారత ఐక్య రైతు సంఘం వనపర్తి జిల్లా కమిటీ తరపున అధ్యక్షులు రాజన్న కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని 14 మండలాల్లో గల పత్తి రైతులు ఈ ఏడాది పత్తి పంటను పెద్ద ఎత్తున సాగు చేశారు. అయితే వర్షాభావ పరిస్థితుల రీత్యా పత్తి రైతులు తీవ్ర నష్టానికి గురైన ప్రస్తుత పరిస్థితుల్లో పండించిన పంటను అమ్ముకోవడానికి జిల్లాలు సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ప్రత్యేకంగా లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఇక్కడ కొనుగోలు కేంద్రం లేకపోవడం వల్ల వనపర్తి జిల్లాల్లోని రైతులు మహబూబ్‌నగర్ గద్వాల, నారాయణపేట జిల్లాలో గల కేంద్రాలకు వెళ్లి ఎన్నో అవస్థలు పడుతూ అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మన వనపర్తి జిల్లాలో ప్రభుత్వ పరంగా సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని కోరారు. కనుక ఈ విషయంలో వెంటనే కలెక్టర్ ఆదర్శ్ సురభి చర్య తీసుకుని పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించాలని కోరారు. పత్తి పంటను పండించిన రైతుల నుండి కేంద్ర ప్రభుత్వం వారు ఈ ఏడాది నుండి ఎకరాకు 12 క్వింటాలు ప్రకటించి ఆన్లైన్ లో ఏడు క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారనడం వల్ల రైతులు దిక్కుతోచని విధంగా నష్టపోతున్నారు. అసలే వర్షాభావంతో నష్టపోతున్న రైతుకు ఈ నిబంధన తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నది. కనుకనే వెంటనే నిబంధన ఎత్తివేయాలని పత్తి కొనుగోలు కేంద్రం జిల్లాలు ఏర్పాటు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం పరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, ఉపాధ్యక్షులు వాసారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, నల్లారెడ్డి, చంద్రసేనారెడ్డి, బాలచంద్రారెడ్డి, గోవర్ధన్, కె.వెంకటయ్య, దేవిడ్లు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న

అఖిల భారత ఐక్య రైతు సంఘం కమిటీ సభ్యులు

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలి

### ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, టిఆర్ఎస్వి

**వనపర్తి, నవంబరు 6 ప్రభాతవార్త:** పెండింగ్లో ఉన్న 8300 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్, పి డిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, టిఆర్ఎస్వి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుండి రాజీవ్ చౌక్, బస్ డిపో రోడ్డు మీదగా ర్యాలీగా వెళ్లి కొత్త బస్టాండ్ దగ్గర పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు రమేష్, గణేష్,వీరయ్య,యశ్వంత్ మాట్లాడుతూ గతఐదు,ఆరు సంవత్సరాలుగా విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బందు చేశారని తద్వారా పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి అన్నారు. గత ప్రభుత్వం వేల కోట్లు పెం డింగ్‌లో పెట్టింది. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు పెండింగ్‌లో ఉండేటువంటి స్కాలర్షిప్‌లు ఫీజు రియంబ ర్స్ మెంట్లు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ఓట్ల మీద సీట్ల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల భవిష్యత్తుపై లేదని అధికారులు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా ఈ ప్రభుత్వాలు చేస్తున్నాయని వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేకపోతే విద్యార్థి సంఘాలుగా విద్యార్థులందరినీ ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, టీఆర్ఎస్వీ నాయకులు గోపాలకృష్ణ, వంశీ, దినేష్, సూర్యవంశం గిరి, అరవింద్, బన్నీ, వీరన్న విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసనను అడ్డుకుంటున్న పోలీసులు

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సిఐ

**అయిజ నవంబర్ 6, ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ విలువలను కాపాడుకోవాలని సిఐ టాటా బాబు విద్యార్థులకు సూచించారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలన పై అవగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన సీఐ టాటా బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మత్తుపదార్థాలు మరియు డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థుల బాధ్యత ఎంతో ఉందని అలాగే వీటికి ఎట్టి పరిస్థితుల్లో ఆకర్షితులు కావద్దని విద్యార్థులకు తెలిపారు. దీనివల్ల సమాజానికి మరియు మీ వ్యక్తిగత ఆరోగ్యానికి చేటు చేస్తుందని అందువల్ల వీటిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమాజంలో ఇప్పటికే అతి చిన్న వయసులో డ్రగ్స్ కు మరియు మత్తు పదార్థాలకు ఆకర్షితులైన యువత వారి జీవితాన్ని సర్వనాశనం చేసుకున్నారని ఈ విషయాన్ని గమనించి మీరంతా తోటి విద్యార్థులతో పాటు మీ మిత్రులకు మత్తు పదార్థాల నిర్మూలనపై మీ వంతు బాధ్యతగా అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు శ్రీనివాసరావు,తరుణ్ మరియు మోటివేషనల్ స్పీకర్ రవీంద్ర ధీర గద్వాల్ జిల్లా ప్రముఖ ఆంజనేయులు అలాగే ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రఘువంశి ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ వెంకటేష్, పట్టణ కార్యదర్శి శ్రీధర్, సంయుక్త కార్యదర్శి నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకేష్ ,అరవింద్ రెడ్డి, విజయ్, రాఘవేంద్ర, శ్రీహరి, అశోక్, వేణు, రాకేష్, నిఖిల్ ,ఉమేష్, బన్నీ, వెంకటేష్ ,మధు మరియు ఆయా కళాశాలల ,పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిఐ



అవగాహన సదస్సు కు హాజరైన విద్యార్థులు

### కట్టుదిట్టమైన భద్రత

### నడుమ ఈవీఎం గోదాము :కలెక్టర్

**వనపర్తి, నవంబరు 6 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం నెలవారి తనిఖీలు చేసినట్లు వివరించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.




ఈవీఎం గోదామును

పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

### ఈ నెల 9న న్యాయ

### సేవ అధికార దినోత్సవం

**సీనియల్ సివిల్ జడ్జి,**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని**

**వనపర్తి, నవంబరు 6 ప్రభాతవార్త :** నవంబర్ 9వ తేదీన న్యాయ సేవాధికార దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కోర్టు ఆవరణంలో అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా సీనియల్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కోర్టు ప్రాంగణం నుండి ర్యాలీ బయలుదేరి బస్టాండ్ కూడలి నుండి తిరిగి కోర్టు ప్రాంగణానికి చేరుకోవడం జరుగుతోందన్నారు.అనంతరం కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికరతపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ, అవగాహన సదస్సులో బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు పోలీస్ సిబ్బంది, పోలీస్ అధికా రులు, మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవం తం చేయాల్సిందిగా కోరారు.

### తీర్మాలపూర్‌లో తాగునీటి ఎద్దడి



తిర్మాలపూర్ లో పాఠశాల వద్ద నీళ్లు పట్టుకుంటున్న కాలనీవాసులు

**ఉప్పునుంతల, నవంబరు 6 ప్రభాతవార్త :** మండలంలోని తీర్మా లపూర్ గ్రామంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ అంతరాయంతో గత నాలుగు రోజుల నుంచి మంచినీటి ఎద్దడి ఏర్పడడంతో పాఠశాల వద్ద ఉన్న బోరు వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని కాలనీవాసులు వాపోయారు. నీళ్లు పుష్కలంగా ఉన్న నోటికి అందకా తల్లడిల్లిపోతున్నారు. అధికారుల అలసత్వంతో నీటికీ గ్రామాలలో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సత్వరమే చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే బాగు చేసి ప్రజలకు తాగునీరు అందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### లీకేజీ పైప్లైన్ల సమస్యను

### పరిష్కరించిన అధికారులు

**మహబూబ్‌నగర్, నవంబరు 6 ప్రభాతవార్త :** మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ సమస్యను మండలాధికారులు ఎంపీడీవో జయరాం నాయక్ మిషన్ భగీరథ సిబ్బందితో పరిష్కరించారు. మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో తాగునీటి పైపులైన్ల లీకేజీ సమస్య ఏర్పడటంతో కాలనీలకు నీటి కొరత ఏర్పడి అధికారుల దృష్టికి తీసుకురాగా గురువారం ఉదయం తాగునీటి సమస్య పైపులైన్ల లీకేజీ సమస్యను త్వరితగతిన పూర్తి చేశారు. అనంతరం ఎంపీడీవో జయరాం నాయక్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు పౌష్టికాహారం విషయంలో జాగ్రత్తలు వహించాలని పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు గ్రామ పంచాయతీ సెక్రెటరీ మిషన్ భగీరథ అధికారులు ఉన్నారు.



పైప్‌లైన్ లీకేజీని సరిచేస్తున్న దృశ్యం

## విద్యార్థులకు అల్పాహారం అందించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, నవంబరు 6 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో బడులలో బోధన సహాయకులను నియమించాలని ప్రత్యేక తరగతులు ప్రారంభం కావడంతో పదవ తరగతి విద్యార్థులు ఉదయం ఖాళీకడుపుతో పాఠశాలకు వస్తున్నారని వారికి అల్పాహారం అందించే యోజన రూపొందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ పక్షాన నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉండడం వల్ల బోధనకు ఆటంకం కలుగుతోందని ఆ ఖాళీలను తాత్కాలికంగా బోధన సహాయకులతో భర్తీ చేయాలని కోరారు. జిపిఎఫ్ ఆన్లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిపిఎఫ్ సెక్షన్‌లో సిబ్బంది కొరతను పూరించాలని తపస్ నాయకులు కలెక్టర్‌ని కోరారు. పదవ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తయిన తర్వాత స్లిప్ టెస్టులు నిర్వహించడం ద్వారా వారికి మంచి ప్రాక్టీస్ అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు గుంపు బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా నాయకులు సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బీసీ జేఏసీ కో కన్వీనర్‌గా ఫకీర్ జహంగీర్ పాషా నియామకం

**జడ్చర్ల, నవంబరు 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఫకీర్ సంక్షేమ సంఘము వ్యవస్థాపక అధ్యక్షులు ఫకీర్ జహంగీర్ పాషాను తెలంగాణ రాష్ట్ర బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్‌గా నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మెన్ ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా జహంగీర్ పాషా మాట్లాడుతూ 136 బీసీ కులాలను ఏకం చేసి 42 శాతం రిజర్వేషన్ కోసం సమాయత్తం చేసి తనకు ఇచ్చిన బాధ్యతను సబ్బండ వర్గాల కొరకు ఉద్యమ స్ఫూర్తిని నింపి వారి వెంట మన హక్కుల కొరకు నడుస్తానని ఈ సందర్భంగా తనకు ఇచ్చిన పదవిని భాద్యతతో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అడుగు జాడలలో నడుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మున్నూరు కాపు సంఘము ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర బీసీ సాధికారత సంఘముఅధ్యక్షులు కొండా దేవన్నపటేల్, రాష్ట్ర బీసీ సంఘము మున్నూరు కాపు సంఘము గోషామహల్ నాయకులు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, నవంబర్ 6 ప్రభాతవార్త:** వెల్దండ మండలం కొట్ర గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు అవోపా ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేసినట్లు అవోపా అధ్యక్షులు పాపిశెట్టి సతీష్‌గుప్త తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఆవోపాఅధ్యక్షులు కోదండరాములు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, మీరు కూడా భవిష్యత్తులో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయబృందం అవోపా సంఘం సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు దేవేందర్, ఫణి కుమార్, విజయ్‌కుమార్, యూనిట్ ప్రధాన కార్యదర్శి శ్రీ శోభన్ బాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహం అనే సామాజిక సమస్యను అధిగమిద్దాం

### శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్



మాట్లాడుతున్న శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్

**నారాయణపేట, నవంబరు 6 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో బాల్య వివాహ సమస్యను అధిగమించి దేశ పౌరుల సామాజిక బాధ్యత బాల్య వివాహాల సమస్యను సమాజం అంతా కలిసి అధిగమించాల్సిన అవసరం ఉందని శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్.ఆర్ గార్డెన్‌లో పూజారులు, పాస్టర్లు, క్వాజీలు ఫంక్షన్ హాల్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులు వంట మాస్టర్లు పాల్గొన్న అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని వాటిని అరికట్టడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వివాహాల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి వర్గం చట్టాన్ని గౌరవించి ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, మహిళాభివృద్ధి అధికారి శ్రీలత, బాలల సంరక్షణ అధికారి కరిష్మ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి సాగు చేసే రైతులకు ప్రత్యేక సాయం

**నారాయణ పేట, నవంబరు 6 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో ఉద్యాన శాఖ మరియు పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా నడుపుతున్న క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మామిడి సాగు చేసే రైతులకు ప్రత్యేక సహాయం అందించనున్నారు. ఈ కార్యక్రమం కింద ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ అయిన ప్రసాద్ సీడ్స్ సహకారంతో మామిడి పండ్లను రక్షించడానికి ఉపయోగించే ఫ్రూట్ ప్రొటెక్షన్ కవర్లు రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కవర్లు పిట్టల నుంచి పురుగుల నుంచి పండ్లను రక్షించడమే కాకుండా పండ్ల నాణ్యతను మెరుగుపరచి మార్కెట్ విలువను పెంచుతాయని అధికారులు తెలిపారు. క్లస్టర్ ప్రోగ్రాం కింద రైతులకు 50సబ్సిడీతో ఈ కవర్లు అందజేయబడతాయి. అర్హులైన రైతులు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఉద్యాన శాఖ అధికారులు రామకృష్ణ 8977714457, జనార్ధన్ హెచ్ఈఓ 9908417971 ను సంప్రదించవచ్చని సూచించారు.

## కన్నుల పండుగగా లక్ష దీపోత్సవం

**మక్తల్ టౌన్, నవంబరు 6 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కార్తీక పౌర్ణమి నాడులక్ష దీపోత్సవం, జ్వాలాతోరణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్వపాపహరణం కార్తీక పౌర్ణమి జ్వాలాతోరణం కింద నుండి వెళ్లినచో మన పాపాలన్ని తొలిగిపోతాయని, అందరూ ఆరోగ్యంగా సుభిక్షంగా ఉంటారని, ఈ కార్తీకమాసంలో విశేష పూజలు, దీపాలు, నోములు, జ్వాలాతోరణం చేయడం వలన వేయి రేట్లు ఫలం దొరుకుందని పురాణాలలో, ఇతిహాసాలలో చెప్పబడినది. మహిళలు ఎంతో ఉత్సాహంగా ముగ్గులను శోభసుజాత, భార్గవి, వీణ, నిరోషా, నిర్మల, కీర్తి, శ్రీలత, జ్యోతి, అశ్విని, అనూష, పార్వతి, శిరీష, సౌమ్య, 11 రోజులు అద్భుతంగా ముగ్గులు వేశారు. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి నాడు మాత్రమే ఈ జ్వాలాతోరణ కార్యక్రమం చేయడం చాలా విశేషమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌కొత్త శ్రీనివాస్‌గుప్తా అధ్యక్షుడు కట్టా సురేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు బోరిశెట్టి పద్మ, ఆర్యవైశ్యసంఘంఅధ్యక్షుడు బొరిశెట్టిభాస్కర్, ప్రముఖులు ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, యువజన సంఘముసభ్యులు, పురుషులు, చిన్నారులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



## చదువుల పండుగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుంది

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**నారాయణపేట, నవంబరు6 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లాలో చదువుల పండుగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ఆలోచన శక్తిని పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో చదువుల పండుగ కలలు కనేద్దాం, నేర్చుకుందాం, సాధిద్దాం కార్యక్రమాల గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల పండుగ విద్యార్థుల్లో సంభాషణనైపుణ్యాలు పెంచేందుకు వేదికగా ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రీడ్ ఏ థాన్ స్పార్క్ వేదిక్ మ్యాథ్స్ యంగ్ ఒరేటర్ క్లబ్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. డీఈఓ గోవిందరాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 10లోపు పాఠశాల స్థాయి, 11న మండల స్థాయిపోటీలు పూర్తి చేయాలని ఎంఈఓలకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్‌సంచిత్‌గంగ్వార్ పాల్గొన్నారు.

## విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు రావాలి

◆ విద్యార్థుల అడ్మిషన్ సంఖ్యను పెంచినందుకు కళాశాల అధ్యాపకులకు అభినందనలు

◆ వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య



అధ్యాపక బృందం నుంచి కాలేజీ వివరాలు తెలుసుకుంటున్న ఇంటర్ విద్యాధికారి

**పెబ్బేరు, నవంబరు6 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేరును వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య ఆకస్మికతనిఖీ గురువారం చేయడం జరిగింది. కళాశాలలోని అన్ని రికార్డ్స్, అడ్మినిస్ట్రేటివ్ రికార్డ్, విద్యార్థుల హాజరు పట్టికరికార్డ్స్, మార్కులరికార్డ్స్, అటెండెన్స్ రికార్డ్స్ఇతర రికార్డ్స్ అన్నీ కూడా పరిశీలించడం జరిగింది. ల్యాబ్‌ల వివరాలు అడిగి తెలుసు కున్నారు. కళాశాల అధ్యాపకులకు ఒక్కొక్కరిని సిలబస్ వివరాలను అడుగుతూ అన్ని వివరాలు నమోదు చేసుకోవడం జరిగింది. అన్ని రికార్డ్‌ల పట్ల సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగింది. వీలైనంత త్వరగా అన్ని సబ్జెక్టుల సిలబస్‌ను పూర్తి చేసి, విద్యార్థుల ఫిబ్రవరి నెల పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు 90 రోజుల ప్రణాళికను, రోజువారి ప్రశ్నలను అధ్యాపకులు అమలుపరచాలని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతూ మీరు రెగ్యులర్‌గా కళాశాలకు రావాలని, మీకు ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ కలదని, ఇంటర్ కమిషనర్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షిస్తారని, రెగ్యులర్‌గా వచ్చి చదువుకొని కళాశాల ఫలితాలు పెంచాలని, మీభవిష్యత్తు మీ చేతుల్లో ఉందని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ సారి గతంలో కంటే మొదటి సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్ సంఖ్యను పెంచినందుకు కళాశాల అధ్యాపకులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎర్ర అంజయ్య, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్‌ఓబుల్‌రెడ్డి, విద్యార్థుల స్టూడెంట్‌కౌన్సిలర్ సి.కృష్ణయ్య, అధ్యాపకులు, హనుమంత్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి, నవీన్ కుమార్, జాకీర్ హుస్సేన్, వెంకటలక్ష్మి, శిల్ప, విమలాదేవి కర్ణాకర్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల విద్యాధికారి నరసింహ

**వీపనగండ్ల నవంబర్6, ప్రభాతవార్త:** విద్యార్థులు గణితంపై పట్టు సాధించినప్పుడే వారి నైపుణ్యత వెలుగులోకి వస్తుందని వీపనగండ్ల మండల విద్యాధికారి నరసింహ అన్నారు. గురువారం వీపనగండ్ల మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను మరియు పి.ఎం. శ్రీ వీపనగండ్ల ఎం.ఆర్సి, పాఠశాలను, పి.ఎస్. బీ.సీ కాలనీ మరియు పి.ఎస్.ఎస్సీ కాలనీ పాఠశాలలను మండల విద్యాధికారి శ్రీనరసింహ సందర్శించడం జరిగింది. కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థినిలకు తగు సూచనలు చేయడం జరిగింది. అలాగే మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఉండేటట్లు చూడాలని అన్నారు. అనంతరం పి.ఎస్. వీపనగండ్ల ఎం.ఆర్సి. పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు గణితం పట్ల ఎవరైతే వెనుకబడి ఉన్నారు. వారిపైన ప్రత్యేక దృష్టి ఉండేటట్లు ఉపాధ్యాయులకు సూచనలు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్.ఎంలు. సాయిలత, కల్పన, అరుణ, మరియు ఉపాధ్యాయులు దేవేందర్, సుస్మిత, మరియు సి.ఆర్పి. వెంకటేష్ పాల్గొన్నారు.

## మెడికల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన

### ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు : ఎస్సై వెంకటేశ్వర్లు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట, నవంబరు6 ప్రభాతవార్త:** నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గురువారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ యాక్ట్, పోక్సో చట్టం ఎన్‌డీపీఎస్ చట్టం సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈసందర్భంగా టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌పై కఠిన నిషేధం ఉందని ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు గమనించిన వెంటనే పోలీసులు లేదా కాలేజీ యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలని విద్యార్థులను కోరారు. అలాగే వైద్యులు భవిష్యత్తులో సింపతీతో కాకుండా ఎంపతీతో సేవ చేయాలి రోగుల సమస్యలను అర్థం చేసుకొని మానవత్వంతో వైద్యం చేయడం వైద్యుని నిజమైన బాధ్యత అని సూచించారు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల వ్యక్తిగత జీవితానికే కాక సమాజానికీ నష్టం కలుగుతుందని చెప్పారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో ప్రజాసేవలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. సంపత్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.కిరణ్ ప్రకాష్, రూరల్ ఎస్సై రాముడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులకు, విద్యార్థులకు కౌన్సిలింగ్



తల్లిదండ్రులకు, విద్యార్థులకు కౌన్సిలింగ్ చేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, నవంబరు 6 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన ఎస్సై వెంకటేశ్వర్లు మైనర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ పిల్లల చేత వాహనాలు నడపించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. అవగాహనలేమితో మైనర్లు డ్రైవింగ్‌చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఇతరుల ప్రాణాలకు ముప్పు కలగవచ్చని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని మళ్లీ రిపీట్ అయిన పక్షంలో చట్ట ప్రకారం తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు వివరించి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఇటువంటి కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## మాదాసి, మాదారి, కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి



**దేవరకద్ర, నవంబరు6 ప్రభాతవార్త:** మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేసి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించే హక్కులను పరిరక్షించాలని కౌకుంట్ల మండల మాదాసి కులపెద్దలు కౌకుంట్ల ఇంచార్జ్ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధన సమస్యల పరిష్కారానికి మాదాసి, మాదారి, కులస్తులంతా ఏకతాటిపై నిలిచి సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాదాసి, మాదారి, కురవలకు తహసిల్దార్ ద్వారా ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నెంబర్ 2, 5, ప్రకారం కుల పత్రాలు జారీచేసి ఆయా కులస్తుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి పాటుపడాలని కోరారు. దళిత బంధులాగా మాదాసి, మాదారి, కులస్తులకు ప్రత్యేకపథకాన్ని రూపొందించిఅమలు చేయాలన్నారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, సంచరిస్తూ గొర్రెలను మేపు కుంటూ తిరుగుతుండడంతో డా.బాబాసాహెబ్ అంబేద్కర్ మా జీవన విధానాన్ని బట్టిసంచార జాతులైన మాదాసి, మాదారి, కురవలమైన మమ్ములనురాజ్యాంగంలో ఎస్సీ కులంలో చేర్చారు. రాజ్యాంగం ప్రకారం అప్పట్లో మాకు ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు అయ్యేవి. కానీ కాలాక్రమమైన నిరక్షరాస్యులైన మాదాసి, మాదారి, కురవలను అధికారులు కురువ, కురుమ, పేర్లతో బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. అప్పటినుండి ఎస్సీ సర్టిఫికెట్ల కొరకై అటు రాజకీయ నాయకులకుగానీ, ఇటు అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు, రాజకీయనాయకులు, స్పందించి సంచార జాతులైనటువంటి మాదాసి, మాదారి ,కురువ కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయవలసిందిగా కోరుతూ గురువారం కౌకుంట్ల తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కురువ కొండన్న, కురువ రవి, కురువ రాజు, కురువ ఎర్రన్న, కౌకుంట్ల మాదాసి, మాదారి, కురువ కుల పెద్దలు పాల్గొన్నారు.

**ఇటిక్యాల నవంబర్ 6, ప్రభాతవార్త:** మాదాసి కురువ / మాదారి కురువ కులస్తులకు ప్రభుత్వం ఎస్సీ కుల దృవీకరణ పత్రాలు జారీ చేయాలని గురువారం మండల తాహ సిల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ నందినికి ఆసంఘం నాయ కులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినతిపత్రంలో వారు వివరిస్తూ రాజ్యాంగంద్వారాగుర్తించబడిన ద్వారా కులాలలో మాదాసి కురువ / మాదారి కురువ ఎస్సీ జాబితాలో ఉందని గతంలో మాకు రెవిన్యూ అధికారులు తప్పుగా కురువ పేరుతో బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి మాకు తీరని అన్యాయం చేశారని మా యొక్క పూర్వీకులు నిరక్షరాస్యత మరియు గొర్రెల కాపరులుగా వివిధ ప్రాంతాలలో సంచరిస్తూ జీవనం సాగించడం వల్ల చాలాకాలం పాటు రెవిన్యూ అధికారులు చేసిన తప్పిదాన్ని గుర్తించలేకపోయామని రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా మాదాసి కురువ/మాదారి కురువ కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు రెవిన్యూ అధికారులు జారీ చేయాలని వినతి పత్రంలో వివరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

## జార్ఖండ్ టు జడ్చర్ల..!

- గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ వైనం
- ఉదండాపూర్ ప్రాజెక్టులో విధులు
- వివరాలు వెల్లడించిన ఈపీఈవో సుధాకర్ గౌడ్

**జడ్చర్ల, నవంబర్6, ప్రభాతవార్త:** ఉదండాపూర్ ప్రాజెక్టులో పని చేస్తూ జార్ఖండ్‌కు చెందిన ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేయగా అసలు విషయాలు బయటకు వచ్చాయి. జార్ఖండ్ రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి జడ్చర్ల పరిసరాల్లో విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 116 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ మహబూబ్ నగర్ డీపీఈవో సుధాకర్‌గౌడ్ తెలిపారు. గురువారం జడ్చర్ల మున్సిపాలిటీ శివారులోని శంకరాయపల్లితండా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటూసాని అదుపులోకి తీసుకొని అతన్ని తనిఖీ చేయగా..116 గ్రాముల గంజాయిని లభ్యమైందని ఒకడిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటుసా ఉదండాపూర్ ప్రాజెక్టులో పని చేస్తూ ఉంటాడని.. జార్ఖండ్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకొచ్చి ప్రాజెక్టులో పని చేసే వారితో పాటు పోలేపల్లి సెజ్‌లో పని చేసే వ్యక్తులకు, జడ్చర్ల పట్టణంలోని పలువురు యువకులకు గ్రాముల చొప్పున గంజాయిని విక్రయిస్తుంటాడని వారు గుర్తించారు. నిందితుడి వద్ద లభించిన గంజాయిని సీజ్‌చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీటీఎఫ్ సుధాకర్ గౌడ్ తెలిపారు. గంజాయి విక్రయించిన, వాడినా చట్టపరంగా కఠినంగా చర్యలుంటాయని హెచ్చరించారు. గంజాయి విక్రయించే వారి సమాచారం ఎవరైనా అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కవిత, ఎస్సై రాజేందర్ సిబ్బంది ఉన్నారు.

## ఆటోను ఢీ కొట్టిన కారు : ఇద్దరికి గాయాలు

**పెబ్బేరు, నవంబరు6 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామం నుంచి కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను కారు ఢీకొట్టిన ఘటన గురువారం పెబ్బేరు మండలం రంగాపూర్ వెళ్లే బైపాస్ వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. స్థానికుల వివరాలు 15 మంది కూలీలతో పెబ్బేరు వైపు వెళ్తున్న ఆటోను కర్నూలు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు పెబ్బేరు మండలం రంగాపూర్ బైపాస్ వద్ద ఢీకొట్టడంతో 12 మందికి గాయాలయ్యాయి. వీళ్ళలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వనపర్తి శాసనసభ్యుడు తుడి మేఘారెడ్డి ఆటో యాక్సిడెంట్ లో గాయపడిన వారిని త్వరగా ప్రథమ చికిత్స అందించాలని వనపర్తి డాక్టర్లకు ఫోన్ చేసి చెప్పడం జరిగింది. వనపర్తిలో అందుబాటులో ఉన్న మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ బ్రహ్మమును హాస్పిటల్‌కు పంపించి గాయాలైన వారికి డాక్టర్ల దగ్గర ఉండి చికిత్స చేయించి వారి బాగోగులు తెలుసుకున్నారు.

## అపరచిత వ్యక్తుల మాటలు నమ్మకూడదు: ఎస్ఐ కురుమూర్తి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కురుమూర్తి

**వెల్దండ, నవంబర్6 ప్రభాతవార్త:** గుర్తుతెలియని ఆపరచిత వ్యక్తుల మాటలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదని ఎస్ఐ కురుమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం సైబర్ జాగృత దివాస్‌లో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్సై కురుమూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్లలో అపరిచితుల వ్యక్తులు చెప్పే మాటలను నమ్మి పోస పోకూడదని ఎట్టి పరిస్థితులలో బ్యాంకు ఖాతా నెంబరు ఓటిపి చెప్పకూడదని తమ తల్లిదండ్రులకు ఇట్టి విషయాలని తెలియజేయాలని, సెల్ ఫోన్లకు బానిస కాకుండా విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**వంగూరు, నవంబర్ 6 ప్రభాతవార్త:** సులువుగా అధిక డబ్బులు సంపాదించడం కోసం సైబర్ నేరగాళ్ళు చేస్తున్న మోసలకు బలికావొదాన్ని, జీవితాలను నాశనం చేసుకోవద్దని వంగూరు ఎస్ఐ మహేష్ తెలిపారు. సైబర్ జాగృతి దివాస్‌లో బాగంగా గురువారం వంగూరు ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్ (చిన్న పనికి ఎక్కువ డబ్బు సంపాదించడం) వంటి మోసాలు, నకలి ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ (తక్కువపెట్టుబడితో అధిక డబ్బులు సంపాదించుకోవడం) వంటి మోసాలు, నకలి ఐపిఓ మోసం నకలి వెబ్సైట్లు సృష్టించి మోసంచేయడం వంటివాటిపై విద్యార్థులకు వివరించారు. ఇలాంటి సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 సైబర్ హెల్ప్ నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థినులకు సూచించారు. క్రీడలని పాఠశాల స్థాయిలో మాత్రమే కాకుండా భవిష్యత్తులో కూడా ముఖ్యం ఆడుతూ కొనసాగించాలని తెలియజేశారు. అలా చేయడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం బాగుంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి, అచ్యుత్ రామారావు, డివైఎస్ సుధీర్ రెడ్డి, డిసిఓ ప్రమోద, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఎంపీడీవో అయిషా, తదితరులు పాల్గొన్నారు.

## నిధుల సంబురం

(మొదటి పేజీ తరువాయి)

అంబేద్కర్ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ మహబూబ్ నగర్‌కు ఇంత పెద్ద స్థాయి అభివృద్ధి ప్రాజెక్టులు రాలేదని, మంత్రులుగా పనిచేసిన నాయకులు కూడా ఈ స్థాయిలో నిధులను మహబూబ్ నగర్ కు తీసురాలేకపోయారని స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని నిరంతరం ప్రజలకోసం పోరాడుతున్న యెన్నం శ్రీనివాస్ రెడ్డికి ప్రజల మద్దతు మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా ఒలిపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, నాయకులు సిజే బెనహార్, మైత్రి యాదయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

చెల్లింపు, పెండింగ్ కేసులపై చర్చించారు. జిల్లాలో సంబంధిత శాఖల సమన్వయంతో ఎస్‌సి, ఎస్‌టి హక్కులపై ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెల చివరన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవంను మొక్కుబడిగా కాకుండా విస్తృత ప్రచారం గావించి నిర్వహించాలని సభ్యులు కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభ్యులు కోరిన విధంగా వారి సూచనలు, సలహాలతో ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవం ను సమర్థ వంతంగా రెవెన్యూ, పోలీస్ అధికారుల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నోట్స్‌ను సభ్యులకు ముందుగానే అందించి నోట్స్‌లో సభ్యులు కోరిన విధంగా ఎస్‌సి,ఎస్‌టి, బిసివిద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, హాస్టల్‌లు, వసతులు,విద్యార్థుల సంఖ్య, అదే విధంగా ఎస్‌సి, ఎస్‌టిలకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మంజూరు,పరిశ్రమల శాఖ ద్వారా ఇస్తున్న సబ్సిడీ పథకాల వివరాలు కూడా చేర్చి అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాల పరిష్కారంపై ఎస్‌సి అభివృద్ధి శాఖ అధికారిని ఎప్పటికప్పుడు ఆయా శాఖలకు రిమైండర్ లు పంపించాలని చర్యా నివేదికలో పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. సీనియర్ సిటిజన్‌ల కేసులలో ఆర్‌డిఓ,కలెక్టర్ ద్వారా అప్పీల్‌లో వచ్చిన ఉత్తర్వులు సక్రమంగాఅమలు అయ్యేలా చర్యలుతీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బాలయ్య, లక్ష్మణ్, రవీంద్ర బాబు, చంద్ర శేఖర్ లు అంబేద్కర్ కళాభవన్ వద్ద ఉర్దూ ఘర్ ఏర్పాటు ను సామరస్యంగా చర్చించి వేరే స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు మోహన్ లాల్ మాట్లాడుతూ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా ప్రభుత్వసబ్సిడీ రుణాలు మంజూరు చేసినవాటిని బ్యాంక్‌లు కొర్రీ లు వేస్తున్నారని, సంబంధిత బ్యాంకులు రుణం మంజూరు చేసేలా చూడాలని అన్నారు.సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో లక్ష్మి నగర్ సర్వే నంబర్ 247,257 ఎస్‌సి కార్పొరేషన్‌కు కేటాయించిన 5 ఎకరాల 3 గుంటల భూమి లో ఆక్రమణలు జరిగాయని, వాటిని తొలగించాలని కోరారు.జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పరిశీలించి హద్దులు నిర్ణయించి, ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ వేయాలని, ఆక్రమణలు ఉంటే వారికి నోటీస్ లు జారీ చేసి డాక్యుమెంట్‌లు పరిశీలించాలని ఆదేశించారు. ఎస్‌పి డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వారా ఎస్‌సి,ఎస్.టి.అట్రాసిటీ కేసుల లో సత్వరం స్పందించి చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,అదనపు ఎస్.పి.రత్నం, డిఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్‌డిఓ నవీన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిఅధికారిణి డి.సునీత, పరిశ్రమల శాఖ జిఎం.యాదయ్య, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.లక్ష్మణ్, రవీంద్ర బాబు, చంద్ర శేఖర్, బాలయ్య, మోహన్ లాల్, వివిధ శాఖల తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్ రావుకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శ



**జడ్చర్ల, నవంబరు6 ప్రభాతవార్త:** ఇటీవల మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ మేరకు గురు వారం హరీష్‌రావు స్వగృహం చేరుకొని సత్యనారాయణ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించినివాళుల ర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం హరీష్ రావుని, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**దేవరకద్ర, నవంబరు 6 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై మార్కెట్ యాడ్ రైతులు, హమాలీలు, అవగాహన కలిగి ఉండాలని దేవరకద్ర ఎస్సై బి.నాగన్న అన్నారు. గురువారం దేవరకద్ర మండల పరిధిలోని మార్కెట్ యార్డులో రైతులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగన్న మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నేరస్తుల నుండి ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించి, ట్రాఫిక్ రూల్స్ గురించి క్లుప్తంగా చెప్పారు. అదేవిధంగా మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని, సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని రైతులు, యువకులు, అవగాహన పెంచుకొని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై నేరాలు ఎక్కువ అయ్యాయన్నారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల మనసులో మార్పు రావాలని దేవరకద్ర ఎస్సై బి.నాగన్న అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాన్ని జయప్రదం చేయాలి

### - యాదవ ఉత్సవ కమిటీ సభ్యులు



**జడ్చర్ల, నవంబరు 6 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణ కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల నవంబర్ 15న సదరు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. గురువారం రోజు పట్టణంలోని పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వానపత్రికలను అందజేసి ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు గౌరవాధ్యక్షుడు మేకల శ్రీశైలం యాదవ్, విశ్వేశ్వర్ యాదవ్, రవికుమార్ యాదవ్, జడ్చర్ల నూతన సదర్ ఉత్సవాల కమిటీ కార్యవర్గ అధ్యక్షుడు బండిగిరి యాదవ్,ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు మచ్చల శ్రీనివాస్ యాదవ్, చెట్టమోని రమేష్ యాదవ్, కోశాధికారి ప్రభాకర్ యాదవ్, సహాయ కార్యదర్శులు నిరంజన్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, సభ్యులుగా చెన్నకేశవులు అల్లే నరసింహ, పెద్దపల్లి శ్రీనివాస్ యాదవ్, హరి యాదవ్, హరి యాదవ్ , సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

### మూడు ఇసుక ఫిల్టర్ల ధ్వంసం చేసిన తహసీల్దార్, ఎస్ఐ

**రాజాపూర్, నవంబరు 6 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న మూడు ఇసుక ఫిల్టర్లను గురువారం ధ్వంసం చేసినట్లు తహసిల్దార్ రాధాకృష్ణ తెలిపారు. రాజాపూర్ ఎస్ఐ శివానంద్‌గౌడ్, ఇతర పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఇసుకను తయారు చేసేందుకు ఉపయోగిస్తున్న ఫిల్టర్లను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఇకపై ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సంధర్భంగా తహసిల్దార్ రాధాకృష్ణ హెచ్చరించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వంగూరు, నవంబర్ 6 ప్రభాతవార్త:** వంగూరు మండలం వెలుమలపల్లి గ్రామానికి చెందిన చెన్నామోని లక్ష్మమ్మ (50)అనే మహిళ అనారో గ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు వేనేపల్లి గణేష్‌రావు గురువారం ఉదయంతన బృందంతో కలిసి మృతురాలి స్వగ్రామానికి చేరుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గణేష్ రావు రాజా రంగారావు మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎల్ల గౌడ్, బిజెపి మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, గ్రామస్తులు శేఖర్ పర్వతాలు తదితరులు ఉన్నారు.

## పి.సుదర్శన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



**మహబూబ్‌నగర్, నవంబర్6, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని మహబూబ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు.వారు ఇరువురు మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పురోగతి పైన, ఆరు గ్యారంటీలపైన సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

# తేమ శాతాన్ని తనిఖీ చేసి నమోదు చేయాలి

### ■ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, నవంబరు6 ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన ధాన్యం నిర్దేశించిన తేమశాతం వచ్చిన వెంటనే తూకం చేసి కేటాయించిన మిల్లుకు లోడ్ చేసి పంపించేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం చిట్యాల లోని మార్కెట్ యార్డులో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిపిసి కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యాన్ని టోకెన్ల వారీగా రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన ధాన్యం నిర్దేశించిన తేమశాతం వచ్చిన వెంటనే తూకం చేసి కేటాయించిన మిల్లుకు లోడ్ చేసి పంపించేయాలని ఆదేశించారు.రైతులు ధాన్యాన్ని తెచ్చిన వారిని తెచ్చినట్లుగా రిజిస్టర్లలో నమోదు చేసి తేమశాతాన్ని తనిఖీ చేసి సీరియస్‌గా నమోదు చేయాలన్నారు. సన్న రకాన్ని దొడ్డు రకాన్ని గుర్తించడంలో నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సదరు కొనుగోలు కేంద్రం యొక్క నిర్వాహకురాలిని సన్న రకంధాన్యాన్ని దొడ్డు రకంధాన్యాన్ని గుర్తించమని కలెక్టర్ ఆదేశించగా వారికి అవగాహన లేకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



06ఎంబిఎన్ఆర్ 8: మార్కెట్ యార్డ్ ను తనిఖీ చేస్తున్న కలెక్టర్



వనపర్తి మార్కెట్ యార్డ్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ధాన్యాన్ని గుర్తించడాన్ని నేర్పించాలని సీసీకి సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే బరువు కొలిచి, నిర్దేశించిన మిల్లుకు లోడ్ చేసి పంపాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు తదితరులు కలెక్టర్ వెంట వున్నారు.

# జస్టిస్ గవాయ్‌పై దాడి అమానుషం

◆ నిరసిస్తూ ఈనెల 17న చలో ఢిల్లీ ◆ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 6,ప్రభాతవార్త:** అక్టోబర్6 న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దళితుడు కాబట్టే అతని మీద కాలి బూటు తోదాడి చేశారని, గతంలో 51 మంది జడ్జీలు ఉన్న పుడు వాళ్ల మీద జరగని దాడి కేవలం గవాయ్ మీదనే జరిగిందంటే కేవలం దళితుడు కాబట్టే అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వాసల పేరుతో దాడి చేశారు అనిఈ దాడిని ప్రధానమంత్రి,రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ .వామ పక్షాలు ,దళిత పక్షాలు అందరూ కేవలం ఖండన వరకు మాత్రమే పరిమితం అయిందని, కానీ ఒక్కరు కూడా కనీసం ఎందుకు చర్య తీసుకోవాలని సుమోటోగాతీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం మీద ఢిల్లీ ప్రభుత్వం మీద ఎవరూ పోరాటం చేయలేదని కానీ చూస్తూ ఉండడాన్ని కనీసం సుమోటోగా తీసుకోకుండా గతంలో జడ్జీలు కూడా కోర్ట్ వ్యవస్థ మీద వ్యాఖ్యలు చేస్తే జడ్జీల మీద చర్య తీసుకున్నారు.. కానీ గవాయ్ మీద ఏకంగా బూటుతో దాడి చేస్తే స్పందన లేకపోవడం చాలాబాధాకరం అని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడైతే ఈ కాలిబూటు తో దాడి జరిగిందో అదే ఢిల్లీలో 30కోట్ల మంది దళితుల పక్షాన ఈ నెల 17న చలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాజ్యాంగ వాదులు,మేధావులు, విద్యార్థులు, పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్, పరుశురాం, కమలాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురు నిందితుల అరెస్ట్

◆ పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకుంటాం

◆ జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్

**కల్వకుర్తి, నవంబర్ 6 ప్రభాతవార్త:** వివాహేతర సంబంధమే అత్యాయత్నానికి దారి తీసిందని జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ పేర్కొన్నారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలోని సంజాపూర్ గ్రామాన్ని ఎస్పీ గైక్వాడ్ సందర్శించి వివాహేతర సంబంధంతో ముగ్గురిపై అత్యాయత్నానికి పాల్పడ్డ స్థలాన్ని ఆయన పరిశీలించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంజాపూర్ కు చెందిన మల్లేష్‌కు వెల్దండ మండలం చెరుకూరు గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైందని ఆయన పేర్కొన్నారు. మల్లేష్ మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే హత్యాయత్నానికి దారి తీసిందన్నారు. ఈ క్రమంలో ఆరు నెల క్రితం ఇరువురు పెద్దమనుషుల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం శిరీషకు తన కూతురుకు ఎకరన్నార పొలం రిజిస్ట్రేషన్ చేసే విధంగా ఒప్పందం చేసుకున్నారని అన్నారు. శిరీషకు 0.300 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు. మిగితా 0.300 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా శిరీష సోదరులు అడుగగా అందులో భాగంగానే శిరీష సోదరులతో పాటు మరో నలుగురు మల్లేష్ పొలం దగ్గరికి వచ్చి ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పొలంలో ఉన్న గొడ్డలి, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారని ఎస్పీ పేర్కొన్నారు.ఈ ఘటనలో గుర్రంమల్లేష్ తండ్రి జంగయ్య, సోదరుడు పరమేష్, తల్లి అలివేలు తీవ్రంగా గాయపడ్డారన్నారు. వీరిలో జంగయ్య పరిస్థితి విషమంగా ఉందన్నారు. హత్యాయత్నానికి పాల్పడ్డ 6 మందిలో ఐదు మందిని అరెస్టు చేశామని ఒకరు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.త్వరలో పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

# విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా బాట

### - విద్యుత్ శాఖ జిల్లా అధికారి కే.వెంకట నరసింహారెడ్డి

**వెల్దండ, నవంబర్6 ప్రభాతవార్త:** విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే ప్రజా బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ) కె.వెంకట నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విద్యుత్ అధికారులు సిబ్బందితో కలిసి పలు వీధుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ కాంగ్రెస్ మట్ట వెంకటయ్యగౌడ్ మండల కేంద్రంలో నెలకొన్నవిద్యుత్ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా కాలనీవాసులను విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు గ్రామస్థాయిలో ఎంతమాత్రం ఉండకుండా పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ వినూత్నంగా ప్రజా బాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య పరిష్కరించేందుకు కొత్తగా విద్యుత్తు అదనపు నియంత్రికులతో పాటు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడం అవసరమున్న చోట మధ్యలో విద్యుత్ స్తంభాలను కొత్తవి ఏర్పాటు చేయడం, ఎక్కడ విద్యుత్ సమస్యలున్న తమ సిబ్బంది దృష్టికి తీసుకొని రావాలని ఆయన సూచించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఏఓ పార్థసారథి, లైన్మెన్లు లక్ష్మణ్ నాయక్, లష్కర్, నాయకులు భరత్ గౌడ్, కాలనీవాసులు, సుధా లక్ష్మయ్య, శ్రీశైలం, మట్ట మదన్ గౌడ్,రవీందర్,భయ్యా ముత్యాలు, లక్ష్మయ్య, సమీర్ ఉన్నారు.



ప్రజాబాట కార్యక్రమంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ) కె.వెంకట నరసింహారెడ్డి

# విద్యార్థుల ప్రతిభను వెలికితీసే క్విజ్ పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

**నర్వ, నవంబరు 6 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాధికారి బి.రాంరెడ్డి పేర్కొన్నారు.విద్యార్థుల మేథస్సు ను గుర్తించేందుకు నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారంమండలంలోని ఆయాపాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి సైన్, టెక్నాలజీ, తెలుగు, హిందీ, ఆంగ్లం,సోషల్, గణితం సబ్జెక్టులపై క్విజ్ పోటీలు,వ్యాస రచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఆబ్జెక్టివ్ పరీక్ష (క్విజ్) పోటీలో జడ్పీహెచ్ఎస్ కల్వాల్ తరుణ్ కుమార్ గౌడ్,క్విజ్ గ్రూప్‌పోటీలో జడ్‌పిహెచ్ఎస్ నర్వ,పెద్ద కడుమూరు విద్యార్థులు,ఉపన్యాస పోటీలో స్వప్న జడ్పీహెచ్ఎస్ నర్వ, ప్రశాంతి ఉందేకోడ్,జ్యోతి కల్వాల్,వ్యాసరచన పోటీలలో డి.నందినినర్వ, నవ్యశ్రీ కల్వాల,పి.నందిని ఉందేకోడు పాఠశాలల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్‌ప్రధానోపాధ్యాయులు సునీత, కల్వాల్ ప్రధానోపాధ్యాయులుబషీర్ అహ్మద్,ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగేష్ ,శ్రీశైలం, మల్లేష్, సురేష్, సిఆర్‌పి నర్సిములు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

### బాదేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్

**జడ్చర్ల, నవంబరు 6 ప్రభాతవార్త:** అన్నదాతలు దళారులను నమ్మి మోసపోవద్దని బాదేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ అన్నారు.పీఏసీఎస్ బాదేపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న కేంద్రానికి తీసుకొని వచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, జడ్చర్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ కోనేటి పుష్పలత, జడ్చర్ల మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, మాజీ ఏఎంసి చైర్మన్లు జనార్దన్ రెడ్డి, కాట్రపల్లి లక్ష్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుదాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్,మండల వ్యవసాయ అధికారిగోపినాథ్, పీఏసీఎస్ మానిటరింగ్ అధికారి ఎండి సాదతలి, సయ్యద్ మినాజొద్దీన్, సీఈవో యాదగిరి,పీఏసీఎస్ డైరెక్టర్లు జీవన్ గుండప్ప,చంద్రయ్య, కృష్ణయ్య,అంజిబాబు,అల్లాపురం నర్సింహ్మారెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు నారాయణరెడ్డి, ఖాజా అలిమొద్దీన్, లక్ష్మణ్, వన్నం కృష్ణయ్య, యాదయ్య, సునిల్, గిరిప్రసాద్, అనుప కృష్ణయ్య, ఆనంద్ మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుదర్శన్ గౌడ్

## కరాటేలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణ పేట, నవంబరు 6 ప్రభాతవార్త:** నారాయణపేట విద్యాశాఖ అధికారి మౌఖిక ఆదేశాల మేరకు జిల్లాలోని 17 పీఎంశ్రీ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ అందించేందుకు కరాటే మాస్టర్లను నియమించనున్నారు. ఈ మేరకు ఆసక్తి గల కరాటే శిక్షకులు ఈ నెల 9వ తేదీ సాయంత్రం లోపు జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో గల డీవైఎస్ఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే కరాటే మాస్టర్లు మహిళలు స్థానికులైతే ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. బాలికల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందించడమే ఈ శిక్షణ లక్ష్యమని ఆయన వివరించారు.

## 9న ఎన్ఎంఎంఎస్ అర్హత ప్రవేశ పరీక్ష

**మహబూబ్‌నగర్, నవంబర్6, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత ప్రవేశ పరీక్ష ఈనెల (నవంబర్) 9న ఉదయం 9:00 గంటలకు నిర్వహించ బడుతుంది. ఈ పరీక్షా కేంద్రాలు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మోడ్రన్ హైస్కూల్ లో మరియు హన్వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగనుంది.జిల్లాలో (ఎన్ఎంఎంఎస్) పరీక్ష రాయబోయే 8వ తరగతి విద్యార్థులందరు ఈ అర్హత పరీక్షను ఉపయోగించుకోవాలని మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు శ్రీ గుండా మనోహర్ కోరారు.ఈ పరీక్ష ద్వారా ఎంపికైన 100 మంది విద్యార్థులకు నవంబర్ 12నుంచి నవంబర్ 22 వరకు జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి లలితాంబిక దేవాలయం నందు పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని, ప్రధాన విలీలీ పరీక్ష ఈ నెల 23న నిర్వహించబడుతుందని తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నారాయణ పేట, నవంబరు 6 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట మండలంలోని అప్పిరెడ్డి పల్లి, కోటకొండ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోరంగేరి హనుమంత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వరి కొనుగోలు జరగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.రైతులు తగిన ధరకే తమ ఉత్పత్తిని విక్రయించగలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో మండలనాయకులు వ్యవసాయ శాఖ అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



**ఊట్కూరు, నవంబరు6 ప్రభాతవార్త:** ఊట్కూర్ నుండి ప్రతి రోజూ వందలాది మంది విద్యార్థులు నారాయణ పేట జిల్లా కేంద్రానికి విద్య కోసం ప్రయాణిస్తున్నారు. బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊట్కూర్ బస్టాండ్ వద్ద విద్యార్థులు బస్సులను ఆపి నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ ఎం. భాస్కర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల సమస్యను తెలుసుకున్నారు. వారిని నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి సమస్యపరిష్కారానికి తీసుకు వెళ్లారు. విద్యార్థులుతమ సమస్యలను వివరించి మెమోరాండం సమర్పించగా, డిపో అధికారులు విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సమయానికి రెండుబస్సులునడిచేలా చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోకళాశాలలకు వెళ్లేఅనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ కుల పత్రాలు జారీ చేయాలంటూ వినతి

**ధన్వాడ,నవంబరు6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మాదాసి కురువ / మాదారి కురువలకు తెలంగాణ రాష్ట్రంలో తప్పుడు బీసీ-బి కుల పత్రాలు కాకుండా, నిజమైన ఎస్సీ కుల పత్రాలు జారీ చేయాలనీ రాష్ట్ర మాదాసి కురువ / మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు మంగళవారం ధన్వాడ మండల కేంద్రంలో తహసిల్దార్ సింధుజకు వినతిపత్రం సమర్పించారు. జాతీయ ఎస్సీ కమిషన్ సిఫారసు మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 1268 ప్రకారం మాదాసి కురువ / మాదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలని, అదే ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లామాదాసి కురువ సంఘం కార్యదర్శి తిప్పన్న మాట్లాడుతూ, మా సమాజానికి అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వమే జారీ చేసిన మెమో అమలు చేయాలి. మాదాసి కురువ నాయకులు కాశ్లప్ప, సాయిలు, గుంజనూరు మల్లేష్, జోగు వెంకటప్ప, ఎర్ర మల్లప్ప, చెంద్రప్ప పాల్గొన్నారు.

**ఊట్కూర్, నవంబరు 6 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలానికి చెందిన మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ హోదా కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు,యువకులు బృందంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బృందం తరఫున మాట్లాడుతూ పెద్దలు తెలిపారు. మాదాసి,మాదారి కుర్వలుపాతకాలం నుంచే శ్రమజీవులు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి చెందిన వీరికి ఇప్పటికీ ఎస్సీ హోదా అందకపోవడం అన్యాయం. మాదాసి, మాదారి కుర్వలను ఎస్సీ జాబితాలో చేర్చి,శాశ్వత ధృవీకరణ పత్రాలుజారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే పెద్ద ఎత్తున నిరసనలు, రాస్తా రోకోలు చేపడతామని" హెచ్చరించారు. తహసీల్దార్ కార్యా లయ అధికారి రామచందర్ రెడ్డి వినతిపత్రం స్వీకరించి, పై అధికారులకు నివేదిక పంపిస్తానని భరోసాఇచ్చారు.కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.